# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 31-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ స్ఫూర్తి దేశ ఐక్యతాభివృద్ధికి ఎంతో ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

- ❖ భారత్, చైనా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని ఇరు దేశాలు స్పష్టం చేశాయి.

- ❖ జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా దేశ వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలకు విశేష ఆధరణ లభించిందని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు.

- ❖ సెప్టెంబరు నెలలో కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ స్ఫూర్తి దేశ ఐక్యతాభివృద్ధికి ఎంతో ముఖ్యమని, ఇందులో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మన్ కీ బాత్ 125వ సంచికలో ఈరోజు ఆయన ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో ఇటీవల జరిగిన మొట్టమొదటి “ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్” ఆ ప్రాంతానికి మరింత ప్రాచుర్యం కల్పిస్తుందన్నారు. భారతీయ సంస్కృతి పట్ల ప్రేమ, గౌరవం ఇప్పుడు ప్రపంచం నలుమూలలకు వ్యాపించిందన్నారు. రష్యాలోని వ్లాదివోస్టాక్‌లో రామాయణంలోని వివిధ ఇతివృత్తాలపై రష్యన్ పిల్లలు వేసిన చిత్రాలను ప్రదర్శించి, పోటీలు నిర్వహించారని తెలిపారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో భారతీయ సంస్కృతి పట్ల పెరుగుతున్న అభిమానం చూసి సంతోషం కలుగుతోందని నరేంద్రమోదీ వ్యాఖ్యానిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం ఆధారంగా భారత్, చైనా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని ఇరు దేశాలు స్పష్టం చేశాయి. చైనాలోని టియాంజిన్ నగరంలో షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు చైనా

అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌తో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ... భారత్, చైనా దేశాలకు చెందిన 280 కోట్ల ప్రజల సంక్షేమం ఇరు దేశాల మధ్య సహకారంపై ఆధారపడి ఉందన్నారు. సరిహద్దు వెంబడి దళాల ఉపసంహరణ, శాంతియుత వాతావరణం నెలకొందని చెప్పారు. సరిహద్దు నిర్వహణకు సంబంధించి ఇరు దేశాల ప్రత్యేక ప్రతినిధుల మధ్య ఒక ఒప్పందం కుదిరిందన్నారు. కైలాష్ మానససరోవర్ యాత్రను తిరిగి ప్రారంభించామని, రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాలు కూడా తిరిగి ప్రారంభించబడుతున్నాయని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుండి మూడు రోజుల పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో పర్యటించనున్నారు. రేపు కర్ణాటకలోని మైసూరులో జరిగే ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ (AIISH) వజ్రోత్సవ వేడుకలకు రాష్ట్రపతి హాజరవుతారు. సెప్టెంబర్ 2న తమిళనాడులోని చెన్నైలో జరిగే సిటీ యూనియన్ బ్యాంక్ 120వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో పాల్గొంటారు. సెప్టెంబర్ 3న తిరువళ్లూర్‌లోని తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం 10వ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి హాజరవుతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఫిట్ ఇండియా "సండేస్ ఆన్ సైకిల్ ర్యాలీ" ఈరోజు న్యూఢిల్లీలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నకేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ.... జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు పలు క్రీడా కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. మొదటి రోజు లక్షలాది మంది ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారని వెల్లడించారు. ఇక రెండవ రోజు, దేశ వ్యాప్తంగా 200కి పైగా ప్రదేశాలలో క్రీడా సమావేశాలు నిర్వహించబడ్డాయని, ఈరోజు దేశవ్యాప్తంగా 10 వేలకి పైగా ప్రదేశాలలో 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం జరిగిందని తెలిపారు. ఫిట్ ఇండియా ఉద్యమాన్ని అనుసరించడానికి సైక్లింగ్ ప్రతీ ఒక్కరూ కొనసాగించాలని మన్సుఖ్ మాండవీయ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సెప్టెంబరు నెలలోనూ కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. సాధారణంగా ఏటా సెప్టెంబరులో 167.9 మిల్లీమీటర్ల వర్షపాతం కురుస్తుందని, ఈ సంవత్సరం సాధారణం కంటే 109 శాతం ఎక్కువ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్రా మాట్లాడుతూ... ఈశాన్య భారత్, తూర్పు, దక్షిణ భారతదేశంలో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షాలే కురుస్తాయని తెలిపారు. ఉత్తరాఖండ్, దక్షిణ హరియాణా, ఢిల్లీ, ఉత్తర రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. చాలావరకు నదుల జన్మస్థానం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోనే ఉందని, ఈ భారీ వర్షాల కారణంగా ఆ నదులు ఉప్పొంగి సమీపంలోని నగరాలు, పట్టణాల్లో వరదలు సంభవించే అవకాశం ఉందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా కప్ హాకీ ఛాంపియన్‌షిప్ లో భాగంగా ఈరోజు బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన మ్యాచ్ లో 3-2 తేడాతో భారత్ జపాన్‌ను ఓడించింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేయగా, మన్‌దీప్ సింగ్ ఒక గోల్ చేశారు. ఈ ఛాంపియన్‌షిప్ లో విజేతగా నిలిచినజట్టు 2026లో జరిగే పురుషుల హాకీ ప్రపంచ కప్ లో స్థానం దక్కించుకుంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =